
# అప్పిగాడి తల్లి

యస్. సీతాలక్ష్మి నాయుడు



పురిటిలోనే కన్నకొడుకును కోల్పోయిన తల్లి కడుపుశోకంలా చీకటి దట్టంగా వుంది.... దూరంగా టౌనులోని లైట్లు మినుగు మినుగు మంటున్నాయి.

"రోజు రోజుకి ఈ ఎదవ మనుసులికి బుద్దినేకుండా పోతూంది. దొంగసచ్చినోల్లు దాన దరమమయినా సెయ్యకుంతున్రు. ఎదవది ఉదయం నుంచి ఈ ముసల్దానిని గుడి దగ్గర కూర్చోబెడితే....యేలకి పదణాల డబ్బులు దొరికినాయి. సీ! మనుసులు సెడిపోతున్రు" అని మనుష్యులను తిట్టుకుంటూ ఆ చీకటిలో టౌను వైపు వెళ్తున్నాడో మనిషి .... వాడి పేరు అప్పిగోడు.

"కాత్త నెమ్మదిగ నడరా" వాడి వెనుక.... వాడి చేయి పట్టుకొని నడుస్తున్న ముసలది.... అప్పిగోడుతో సమానంగా నడవలేక....ఆయాస పడిపోతూంది.

"బిరానరాయే దొంగముండ! అసలు ఆ మనుసుల్నికాదే నిన్ననాలే! ఉదయం నుంచి ఆ ఎంకటేస్పురిడి గుడికాడున్నావ్! ఇయ్యేల శనోరము. ఈచరికి ఏ ఐదో పదో సంపాదించుంతావు. ఇయ్యేలన్నా....పులావు....తినాలను కొన్నాను. సీ! పదణాలు. నీకు సిగ్గునేదే! అచలు నువ్వు....అక్కడ ... ఎవుల్నయినా దరమం సెయ్యమని అడుగుతున్నావా? తొంగుండి పోతున్నావా?" ముసలిదానిమీద అగ్గిపొరయి పోయాడు అప్పిగోడు. చాలా రోజులనుంచి వాడికి పులావ్ తిందామనే బలమైన కోరిక తీరకుండా అలా వుండిపోయింది. టౌనువైపు అంటే....టౌనులో వెలుగుతున్న లైట్లవైపు చూస్తుంటే పులావే గుర్తుకొస్తుంది. ముసలిది తాను అనుకున్నట్టు ఏ ఐదో, పదో సంపాదించ లేదనే, వాడికి బోలెడు కోపంగా వుంది. పైగా.... ముసిలిది....నడవటానికి ఆయాసపడిపోతూంది. వాడికింకా కోపమొచ్చేసింది.

"ఏటి సెయ్యమంతావురా! కడుపు కాలి పోతున్నా 'అమ్మా! బాబూ!! దరమం సెయ్యండి' అని అరిసినాను. దరమరాజులు డబ్బులిచ్చినారు. మరా కుంటు సోములుగాడేమో అందిర్దగ్గిరా డబ్బులు నాగేసుకొని తలో పదనాలిచ్చినాడు. గుడ్డిదాన్ని....నాకేటి కనబడతాదా? సేత్తాదా? అందుకే నిన్ను నాకాడుండమంటే ఉండకుంతున్నావ్?" వరుసగా....అంతసేపు

మాట్లాడ్డంతో ముసిలిదానికి ఆయాసం పెరిగి పోయింది. జీవితంలోని చరమగీతం పాడుతున్న జీవి... ఆమె. నడవటమే కష్టంగావుంది. ఇక మాట్లాడుతూ నడిస్తే చెప్పేదిముంది? రొప్పుకుంటూ నిల్చుండిపోయింది.

"సరిలే—నీ గుడ్డిమేలానికితోడు నేను గుడి దగ్గిరేదిత్తే మనకి బువ్వే. నేనేదో అలా బస్సులచేండుకెల్లి నాలుగు జేబులు కొడితేనే మనకి బువ్వ. సర్లే బేగినడు. కడుపు మంది పోతుంది బేగినడు...." అని....తన ఉద్యోగాన్ని గురించి....కాస్త గొప్పగా ఉద్ఘాటించి ఆవెనుక నడువకుండా, నిలబడిపోయిన ముసల్దాని చేయి పట్టుకు ముందుకు లాగాడు.



"ఒరే అప్పిగా నాను నడలేన్రా! కూసింతసేపు ఈడ కూకుంతారా" అంటూనే రోడ్డు మీద చతికిలబడిపోయింది ముసల్ది.

"నేగే! నెగు! అర్రే! నెగమంతుంతే. తన్నాలా నెగుత్తావా?" అని....అనేక రకాలుగా తిట్టి, అనేక విధాల ముసల్దానిని లేపేందుకు ప్రయత్నించి—చివరకు...."ఇది సచ్చినా బాగున్ను" అని వదిలేసాడు అప్పిగోడు. వాడు ఇదేమాట.... ఇప్పటికే ఎన్నో లక్షలసార్లన్నాడు. ఈ అప్పిగాడి....నెత్తిని రూపాయిపెట్టి, బజారులో బేరానికి పెడితే....పైసాకిగూడా ఎవడూ కొనడు వీడిని. అంత ఫస్ట్‌క్లాస్ వెధవవీడు! వీడి తిండికి, త్రాగుడికి....ఈ గ్రుడ్డిదాని సంపాదనే ఆధారం. రోజూ....ఈ ముసలిదానిని గుడిదగ్గర కూర్చోబెట్టి, వీడు బస్టాండుకెళ్తుంటాడు. మంచి రోజయితే బరువయిన జేబులు దొరుకుతాయి. లేకుంటేలేదు. ఆ ప్రయత్నంలో దొరికిపోతే చాలా బరువైన బహుమానాలే దొరుకుతుంటాయి. పగలంతా ఇటువంటి గౌరవనీయమైన వృత్తిలో గడిపి, సాయింత్రానికి తిరిగి గుడిదగ్గరకెళ్ళి ముసలిదానిని తీసుకొని టౌనుకెళ్తాడు. ముసల్ది అడుక్కొని సంపాదించిన డబ్బులతో పూటుగా తాగేస్తాడు. ఆవెనుక....ముసలిదానిని తీసుకొని హోటల్‌కి వెళ్తాడు. గ్రుడ్డిదానిని చూసి హోటల్ వాడు, మిగిలిపోయిన అన్నాన్ని....పడేస్తాడు. దాంతో ముందు వీడు శుభ్రంగా కడుపు నింపుకొని, ఏమైనా మిగిలితే ముసల్దానికి పడేస్తాడు. ఆ మిగిలిన మెతుకులను తిని కడుపు నింపుకొని, మర్నాడుదయం నుంచి సాయింత్రం వరకూ గుడిదగ్గిర కూర్చొని "అమ్మా" "నాయినా" అని....అరుస్తూ, డబ్బులు దండాలి....ఆ ముసిలిది. ఇంతకీ—ఆ ముసలిది అప్పిగాడి తల్లి!! స్వయాన అప్పిగాడిని....నవమాసాలు మోసిన కన్నతల్లి! అష్టకష్టాలకోర్చి....పెంచి....పెద్ద చేసిన....తల్లి!!!

తను అంతగా....తల్లిమీద ఆధారపడబట్టే అప్పిగాడు తాననేకసార్లనుకొన్నట్లు....దాని పీక నులిపెయ్యకుండా, క్షమించేసి వదిలేస్తున్నాడు.

రోడ్డుమీద నడవలేక చతికిలబడిపోయిన తల్లిని అలాగే వదిలేసి వెళ్ళిపోదామా—అన్నంత ఆవేశమొచ్చేసింది అప్పిగాడికి. "ఈ పదనాలు మందుకు సరిపోతుంది. ఇక....పులావు మాటకేంగాని, కూడో? ఇది నేకపోతే ఆ వాటలు గాడిద కూడెయ్యడే" అని ఆలోచించి, ఆవేశాన్ని అణుచుకున్నాడు. ఆ ఆలోచన రాగానే వాడికి ముందు .... హొటల్ వాడిమీదా .... ఆ తరువాత తల్లిమీదా....కోపమొచ్చేసింది.

"లేయే! బేగిరా" అనేసి....తల్లి రెక్కపుచ్చుకొని లేపబోయాడు. ముసలిది లేవబోయి, లేవలేక తూలిపడిపోయింది. అప్పిగాడి కోపం తారస్థాయికి చేరుకొంది. తెలుగు సాహిత్యంలో ఏకవీ తల్లిని వర్ణించడానికి ఉపయోగించని పదజాలాన్ని ఉపయోగించి తిట్టి....లేపబోయాడు. ఫలితం శూన్యం. దాంతో మరింత పెట్రేగిపోయి....ముసిలిదానిని అటూ ఇటూ కుదిపేసి.... ఏదో జంతువునీడ్చేసినట్లు ఈడ్చేయబోయాడు. ఇంతలో....వెనకనుంచి వస్తున్న కారు శబ్దానికి ఉలిక్కిపడి ఎగిరవతల పడ్డాడు. కారు మాత్రం తిన్నగా వెళ్ళిపోయింది; కారు క్రింద ముసిలిది నలిగిపోయింది!

ముసలిదాని ప్రాణాలు పోకముందే కారాగింది. ఎగిరవతల పడి ప్రాణాలను దక్కించుకొన్న అప్పిగాడు, లేచినిల్చున్నాడు. ప్రాణాలు పోయే స్థితిలో మూలుగుతున్న తల్లి మూలుగు విన్నాడు. పక్కనే ఆగివున్న కారును చూశాడు. ఎక్కడలేని ధైర్యం, ఆవేశం, కోపం, వచ్చి వాడిని చుట్టుముట్టేశాయి. అక్కడున్న కారు దగ్గరకెళ్ళి డోర్ తెరచుకొని లోనికి జొరబడి కారు నడుపుతున్న మనిషిని పట్టుకున్నాడు. ఆ మనిషి బాగా తాగేసి వున్నాడు. కారులో లైటు వెలుగుతూంది. ఆ వెలుగులో, లోనికొచ్చి తనను పట్టుకొన్న మనిషివైపు మత్తుగా చూసాడు మందు మనిషి.

"ఎవరయినా చచ్చారా?" చాలా సామాన్యంగా అడిగాడు.

"అవున్రా! తాగుబోతు నాయాలా! నాయమ్మ—అమ్మ చచ్చిపోయిందిరా. నా అమ్మను నీ కారు పొట్ట పెట్టుకొందిరా. నేను నిన్ను చంపుతాన్రా.....గొర్రిపోతు నేచేసేసినట్టు ఏడేసేత్తానురా....ముక్కలు ముక్కలు కింద నరికే

త్తానురా....'' అని ఎగిరిపోయాడు అప్పిగాడు.

మందు మనిషి నర నరాల్లో మందు ప్రవహిస్తున్నా అతనికి బోలెడంత ముందుచూపుంది. ఇలాంటి మనుష్యులకేం గావాలో అతనికి బాగా తెలుసు. అంచేత, వెంటనే పర్స్ తీసి పది వంద రూపాయిల నోట్లు తీసి, అరుస్తున్న అప్పిగాడి నోట్లో కాకుండా, వాడి చేతిలో కుక్కేశాడు. అప్పిగాడి నోరు మూత పడిపోయింది. వాడిని కారులోనుంచి దించేసి తను మాత్రం కారుతో సహా ముందు కెళ్ళిపోయాడు మందుమనిషి.

దేవుడు అకస్మాత్తుగా దర్శన మిచ్చేసి "ఒరేఁ అప్పిగా! నీ భక్తికి మెచ్చాను. ఇంద ఈ వెయ్యీ పట్టుకుపోయి శుభ్రంగా మందు కొట్టేయ్" అని వరమిచ్చేసి, వెయ్యి రూపాయిలిచ్చేసి అంతర్ధాన మయిపోయినట్లుంది అప్పిగాడికి. వాడు, కొన్ని క్షణాల వరకూ ఆ షాక్ నుంచి తేరుకోలేదు. నోట్లను పట్టుకొన్న చేతులను గుండెల కానించేసుకొని, అలాగే వుండిపోయాడు.

చావుతో అంతిమ పోరాటాన్ని సాగిస్తూంది ముసలిది. ఆమె హృదయ విదారకంగా మూలుగుతూంది. ఉలిక్కిపడ్డాడు అప్పిగాడు. జరిగింది తలచుకొని, చేతిలోని డబ్బును తడుముకొని సంతోషించాడు. ముసిలిదాని మూలుగు విని, ఆమె చావనందుకు బాధపడి, ఆ వెనుక భయపడ్డాడు.

ఆ దేవుడు గాని తిరిగొచ్చేసి, 'మీ అమ్మ చావలేదు. ఆ వెయ్యి రూపాయిలు తిరిగిచ్చేయ్.' అని తీసుకుపోతే? అమ్మబాబోయ్! వెయ్యి రూపాయిలు–ఈ జన్మలో ఇంత డబ్బు కళ్ళ జూడగలడా తను – ఆ ఊహరాగానే అప్పిగాడు ఇంక అక్కడుండలేదు. పరుగు లంకించుకున్నాడు.

టౌనులోని కొచ్చి ఆగి, ఊపిరి పీల్చుకున్నాడు. పది పెద్ద నోట్లను భద్రంగా జేబులో వేసుకొన్నాడు. చుట్టూ చూశాడు. ఎదురుగా, రంగు రంగుల బల్బులతో వెలిగిపోతున్న పెద్ద హోటల్ కనిపించింది! అప్పిగాడికి తన పులావ్ కోరిక గుర్తుకొచ్చింది. మోకాళ్ళ వరకూ మడుచుకున్న ప్యాంటును విప్పి కాళ్ళ వరకూ దించుకొని, చొక్కాతో ముఖం తుడుచుకొని. జుత్తు వ్రేళ్ళతో సరిచేసుకొని హోటల్ లోనికి నడిచాడు. తన కిష్టమయినవన్నీ తెప్పించుకు తిన్నాడు. బేరర్ బిల్ పెట్టి తెచ్చిన ప్లేట్ లోనికి, వంద రూపాయిల నోటును నిర్లక్ష్యంగా విసిరి, విలాసంగా కాళ్లాడిస్తూ కూర్చున్నాడు.

చిల్లర పట్టుకొని తిరిగొస్తాడను కొన్న బేరర్, పోలీసులను వెంట బెట్టుకొని తిరిగొచ్చాడు. పోలీసులు అప్పిగాడిని చూసి చాలా హేళనగా నవ్వి "ఒరే! అప్పిగా! నువ్వట్రా! ఇంత పెద్దోడి వెప్పుడయ్యావురా! జేబులు కొట్టడం మానేసి దొంగనోట్ల వ్యాపారం ఎప్పుడు మొదలెట్టావ్" అని మెచ్చుకొని, వాడి జేబులోవున్న మిగతా నోట్లను గూడ తీసుకొని, అవీ దొంగ నోట్లేఅని నిర్ధారణ చేసుకొని అప్పిగాడిని తమతో బాటు స్టేషన్‌కు తీసుకుపోయారు!

జైల్లో కూర్చున్న అప్పిగాడికి, బేరర్ మీద గాని, హోటల్ మేనేజరు మీద గాని, పోలీసుల మీద గాని ఆఖరికి దొంగనోట్లిచ్చిన దేవుడు మీద గాని కోపం రాలేదు. "ఓసి నా తల్లీ! నువ్వు సచ్చి, నన్ను సాదించినావు గదే" అని తన తల్లి మీద మాత్రం బోలెడు కోప పడిపోయాడు! □

## పుస్తకాలు

### వెన్నెల మండుతోంది
(నవల)

[రచన: వాసిరెడ్డి సీతాదేవి; ప్రచురణ: ఎం. శేషాచలం అండ్ కో, మద్రాసు; పాకెట్ సైజులో 128 పేజీలు; వెల: రూ. 3–50]

డిగ్రీ ఉండీ నిరుద్యోగి అయిన చంద్రశేఖరం పేవ్‌మెంటు మీద దిక్కులేని చావు చచ్చిన ముసలివగ్గులో కన్నతల్లినీ; పతితల్లోనూ, అనాథల్లోనూ తన ఇంటి ఆడబడుచునూ చూడగలుగుతాడు. అతనిలో ఒక రకమైన తిరుగుబాటుతనం నిద్రలేస్తుంది. కళ్ళు తెరచి చుట్టూ గమనించే అతనికి కనిపించినవి కమనీయమైన దృశ్యాలు, రమణీయమైన రంగుల హరివిల్లులు కావు–ఆకలి, నైచ్యం, మానసికపతనం. ఆస్తిక వాదాన్ని, పలాయన వాదాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోసే ఈ నైతిక సమాజంలో వెన్నెల ఎప్పుడు మండుతుందో, మనిషి ఎందుకు విప్లవోన్ముఖుడు అవుతాడో చెప్పారు రచయిత్రి.

మనలో నిద్రాణమైన ఆలోచనలను నిద్రలేపి, బలవంతంగా నిజాన్ని చూపించగల ఏ నవలైనా గొప్పదే. అటువంటిదే ఈ చిన్న నవల. పర్సులు కొట్టేయడం, వెంకటేశ్వరస్వామి పేరుతో డబ్బులు గుంజడం, చిలక జ్యోతిషం చెప్పడం.... ఇటువంటి సంఘ విద్రోహక చర్యలను బ్రతుకు తెరువు పేరుతో ఒప్పుకుంటున్న ఈ సమాజం, విప్లవకారులను, కొత్త సమాజం కోరేవారిని విద్రోహులంటుంది. కానీ, వాల్ పోస్టర్లు అతికించడం, నినాదాలు చెయ్యడంతో చంద్రం సమస్య తీరదు. ఉన్నతులైన యువకులను మూడో కమ్యూనిజం పేరుతో తప్పుదారి పట్టించే స్థిరభావాలులేని బలహీనులు స్వార్థపరులు నాయకులుగా చలామణీ అయితే, పరిణామాలు ఘోరాలౌతున్నాయి. తన కత్తిలాంటి పదునైన కలంతో, చెప్పదలుచుకున్నది సూటిగా చెప్పగలిగే రచయిత్రి ఈసారి ఈ సమస్యను కథావస్తువుగా తీసుకుని, అక్షయకోటి కిరణాలతో స్వయం ప్రకాశమానుడైన నిజమైన 'వ్యక్తి'ని సృష్టిస్తారని ఆశించడంలో తప్పు లేదేమో!

### అందని అదృష్టం
(నవల)

[రచయిత్రి: మోచర్ల జయశ్యామల; పబ్లిషర్స్: జయంతి పబ్లికేషన్స్; ఏలూరురోడ్, విజయవాడ-2; క్రౌన్ ⅛ సైజులో 168 పేజీలు; వెల రూ. 5-00]

ఒక చక్కటి కుటుంబ గాథను కథ చెప్పినట్లుగా రాశారు రచయిత్రి. ఇందులోని అన్నపూర్ణ, భార్గవి, కాళింది మొదలైన అన్ని పాత్రలు ప్రతి కుటుంబంలోనూ తారసపడుతూ ఉంటాయి మనకు. నిందమొయ్యలేని అన్నపూర్ణ ఆత్మాభిమానం, తను ప్రేమించిన అరవిందను జీవితపు మలిపొద్దులో కలుసుకుని ఆతిథ్యం ఇచ్చి, తను పెంచిన బిడ్డలు, తన ఒకప్పటి ప్రియురాలు అరవింద....అందర్నీ అలా జీవితమనే రైలు ఎక్కించి ఒంటరిగా, నిశ్శబ్దంగా నిలబడి వీడ్కోలు ఇచ్చే భార్గవి పాత్ర చిత్రీకరణ చాలా బావుంది. తను అనుకున్న విధంగా పాత్రలను సృష్టించడానికి ఏ మాత్రం శ్రమపడలేదు రచయిత్రి. చక్కగా కథ చెప్పగల నేర్పు ఉన్న ఈమె మరిన్ని చక్కటి నవలలు రాస్తే చదవాలని ఎవరికైనా వుంటుంది.